పరిటాల క్వారీల వద్ద రైతుల ఆందోళన

కాలుష్యం బారి నుంచి పొలాలను కాపాడాలని డిమాండ్



కంచికచర్ల మండలం పరిటాల రాతి క్వారీల వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు



ఆందోళన కారణంగా నిలిచిపోయిన లారీలు

కంచికచర్ల: రాతి క్వారీలు, క్రషర్ల కారణంగా తమ పంట పొలాలన్నీ బీడు భూములుగా మారుతున్నాయని పరిటాల గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలు, క్రషర్ల వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో క్వారీలు, క్రషర్లకు వచ్చే లారీలు రెండు వైపులా భారీగా నిలిచిపోయాయి. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ దొనబండ రాతి క్వారీల సమీపంలో సుమారు 500 ఎకరాల పంట భూములున్నాయని, రెండు పంటలు బాగా పండే ఈభూముల్లో క్రషర్ల నుంచి పెద్ద ఎత్తున దుమ్ము ధూళి పడుతోందన్నారు. దీంతో పంటలు పండక జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. క్వారీల దుమ్ము ధూళి కారణంగా సాగుచేస్తున్న పంటలన్నీ ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. రాతి క్వారీల్లో బ్లాస్టింగ్ చేసే సమయంలో పెద్దపెద్ద రాళ్లు లేచి పొలాల్లో పడుతుండటంతో కూలీలు తీవ్ర గాయాలపాలవుతున్నారన్నారు.

సాగర్ కాల్వ పూడ్చివేత...

మూలపాడు మేజర్ కెనాల్ ద్వారా తమ పంట భూములకు సాగర్ జలాలు వస్తుండగా, క్వారీల నిర్వాహకులు ఆ కాల్వను పూడ్చివేయడంతో సాగర్ జలాలు నిలిచిపోయాయని రైతులు వాపోయారు. కాల్వను పూడ్చివేయడంతోపాటు పలువురు కాల్వ గ్రావెల్‌ను సైతం అమ్ముకున్నారని ఆరోపించారు.

భూములు లాక్కునేందుకు యత్నం...

తమ పంట పొలాలను తక్కువ ధరకు తమకే విక్రయించాలంటూ పలువురు క్వారీ గుత్తేదారులు బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రాజధానికి అతి సమీపంలోని తమ పొలాల ధర ఎకరం రూ.95లక్షలు పలుకుతుండగా రూ.40లక్షలకే ఇవ్వాలని క్వారీ యజమానులు బెదిరిస్తున్నారన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కంచికచర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానస క్వారీల్లో ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు. ఆందోళన సందర్భంగా రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

బెదిరిస్తున్నారు...



క్వారీల సమీపంలో తమ కుటుంబానికి 10ఎకరాల పొలం ఉంది. మేజర్ కాల్వ ద్వారా మా పొలాలకు సాగర్ నీరు వచ్చేది. రెండు పంటలు బాగా పండేవి. క్వారీల్లో బ్లాస్టింగ్ కారణంగా పెద్ద పెద్ద బండ రాళ్లు పొలాల్లో పడుతుండటంతో పనులకు కూలీలెవ్వరూ రావడం లేదు.

–ఆకుల కుటుంబరావు, పరిటాల

పొలమంతా ధూళే...



నాకు ఐదెకరాల పొలం ఉంది. క్రషర్ల నుంచి దుమ్ము, ధూళి వెదజల్లుతుండటంతో పొలాల్లోని పంటలన్నీ ఎండిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా క్వారీలు, క్రషర్లు మూసి వేయించకపోతే మాపొలాలన్నీ బీడుభూములుగానే మిగిలిపోతాయి.

–బండ్ల నాగేశ్వరరావు, పరిటాల

కాల్వను పూడ్చారు...



సాగర్ జలాలు మూలపాడు మేజర్ కెనాల్ ద్వారా వచ్చేవి. ఆ సాగునీటితో రెండు పంటలు పండించేవాళ్లం. కాని సాగర్ కాల్వలను పూడ్చివేసి ఆ మట్టిని కూడా క్వారీ యజమానులు విక్రయించారు. తమ భూములను ప్రభుత్వమే కాపాడాలి.

–పురమా వెంకటశివప్రసాద్, పరిటాల

అమ్ముకోనివ్వట్లేదు



నాకు ఉన్న రెండు ఎకరాల భూమి పక్కనే క్వారీలు ఉన్నాయి.ఈ క్వారీల రాళ్లు, క్రషర్ల నుంచి దుమ్ము పడుతుండటంతో పంటలు పండటం లేదు. నా భర్త వైద్యఖర్చుల కోసం పొలాన్ని అమ్ముకుందామంటే క్రషర్ల యజమానులు అమ్ముకోనివ్వకుండా అడ్డుపడుతున్నారు.

–పురమా మాధవి, పరిటాల

క్లుప్తంగా

పీ4 సర్వేపై సమీక్షా సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నితిన్ గురువారం పీ4 సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో పీ4 సర్వే చేపడుతుందని తెలిపారు. ఈ సర్వేలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములై సచివాలయాల పరిధిలో పేదలను గుర్తించాలన్నారు. అందుకు కుటుంబ సభ్యుల వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మెట్‌లో నమోదు చేసేలా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శులు జగ్గయ్య, సంక్రాంత్, శ్రావణ్, శివాజీ, మంగమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే పరిశీలన



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని నందిగామ డివిజన్ ఆర్డీఓ కె. బాలకృష్ణ కోరారు. మండలంలోని ముచ్చింతాల గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించాలన్నారు. రీసర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా రైతులు కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటస్వామి, మండల సర్వేయర్, స్వప్న, వీఆర్వో వెంకటమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వీరులపాడు: కేంద్రప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంలో ఉన్న శ్రద్ధ, కార్మికుల సమస్యల పరిష్కరించడంలో లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి విమర్శించారు. ఈనెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకుని మండలంలోని కొణతాలపల్లి, జమ్మవరం, వీరులపాడు గ్రామాల్లో గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ కార్యకార్తలతోపాటు ఇతర రంగాలలో పని చేస్తున్న వర్కర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖను ప్రక్షాళన చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)ను మరింత అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖను ప్రక్షాళన చేయాల్సి ఉందని సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. హరిత బెరంపార్క్‌లో గురువారం ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి పరిచే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధికి సంబంధించి 20 ప్రతిపాదనలను సిద్ధం చేశామని వివరించారు.

భవానీ ఐలాండ్‌ను సరికొత్త అందాలతో తీర్చిదిద్దనున్నామన్నారు. అలాగే ద్వీపానికి వచ్చే పర్యాటకులకు రెండు గంటల పాటు నిర్విరామ వినోదాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టామని చెప్పారు. భవానీ ఐలాండ్‌లో వాటర్ స్పోర్ట్స్‌తో పాటు బోధిసిరి డబుల్ డెక్కర్ బోట్‌లో ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు అనువుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అరకు కాఫీకి విశేష ప్రాచుర్యం కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 అవుట్‌లెట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పర్యాటక కేంద్రాల్లో టాయిలెట్స్ సౌకర్యంతోపాటు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా సౌకర్యాలు, వసతులను కల్పించటమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. 79 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మందికి 6వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు భారీగా జరిమానా విధించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. 5వ ట్రాఫిక్ పోలీసులు ఈ నెల 14వ తేదీ రాత్రి జరిపిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 79 మంది పట్టుబడినట్లు వెల్లడించారు. వీరిని న్యాయమూర్తి లెనిన్‌బాబు వద్ద గురువారం హాజరుపర్చామని తెలిపారు. నిందితుల్లో 14 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున, 65 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా రోజూ వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు సీపీ రాజశేఖర్‌బాబు తెలిపారు.

వత్సవాయి ఇన్‌చార్జి ఎంపీడీఓగా నితిన్

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ఎంపీడీఓ నితిన్, వత్సవాయి మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ నియమితులయ్యారు. వత్సవాయి ఎంపీడీఓ రాంబాబు సెలవుపై వెళ్లడంతో ఆస్థానంలో ఇన్‌చార్జిగా నితిన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీచేశారు.

కౌలు వేలం నిర్వహణ

పెండ్యాల(కంచికచర్ల): మండలంలోని పెండ్యాల సీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామివారి ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహించారు. నందిగామ గ్రూపు దేవాలయాల ఎండోమెంట్ అధికారి నారాయణ నరసింహమూర్తి పర్యవేక్షణలో కౌలు వేలం నిర్వహించారు. స్వామి వారి ఆలయానికి చెందిన 10 ఎకరాల పొలాన్ని రూ.1.05లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ముగిసిన తిరునాళ్ల మహోత్సవాలు

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు, అభిషేకాలతోపాటు దీవెన బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ నరసింహమూర్తి, వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

జకీయాఖానం తీరు గర్హనీయం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా, పక్కన షేక్ మున్నిహీరా, ఫిరోజ్‌ఖాన్

జగ్గయ్యపేట అర్బన్: శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకీయా ఖానం బీజేపీలో చేరడం ద్వారా ముస్లిం సమాజానికి నమ్మకద్రోహం చేశారని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పఠాన్ హఫీజున్నీసా మండిపడ్డారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆమె ముస్లిం నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హఫీజున్నీసా మాట్లాడుతూ భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న జకీయాఖానంను వైఎస్సార్ సీపీ అక్కున చేర్చుకుని రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చిందని గుర్తుచేశారు. జకీయాఖానంను ఉన్నత పదవిలో కూర్చొనబెట్టి రాష్ట్రస్థాయిలో గుర్తింపునిచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ముస్లింకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు అనేకమందికి రాజ్యాంగ, రాజకీయ పదవులు దక్కేలా చూశారన్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా నల్లచట్టాలను తెచ్చిన బీజేపీలో చేరడం ద్వారా జకియాఖానం ముస్లిం జాతికి తీరని ద్రోహం చేశారన్నారు. ముస్లింలు ఆమెను ఎన్నటికీ క్షమించరన్నారు. జకీయాఖానం తీరు గర్హనీయమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌ఖాన్, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు షేక్ మున్నిహీరా పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



పేట గ్రంథాలయంలో యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంచికచర్ల: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులచే ఇంగ్లిష్ చదవడం, రాయడంపై అభ్యాసం చేయించారు. చెస్ ఆటను నేర్పించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లోని అన్నిరకాల పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. డ్రాయింగ్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఎం.కనకారావు, నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక జిల్లా గ్రంథాలయంలో గురువారం పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముందుగా పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ విద్యార్థులకు మంచితనం, వ్యక్తిత్వం, మానవత్వం తదితర అంశాలపై మహనీయుల హితోక్తులను వివరించారు. అనంతరం యోగా టీచర్ లీలావతి విద్యార్థులతో యోగాసనాలు చేయించి, వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వినోద్ బాబు, గ్రంథాలయ సిబ్బంది రమేష్, రాము పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పెళ్లికి వెళ్లి మరుసటి రోజు ఇంటికి వచ్చే సరికి బంగారం, వెండి, నగదు అపహరణకు గురైన ఘటన ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన నారిన పద్మ కుమారి, సత్యనారాయణ దంపతులు, వీరికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. సత్యనారాయణ కబేళా సెంటర్‌లోని పెయింట్ కంపెనీలో పనిచేస్తాడు. అతను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈనెల 11న పద్మ కుమారి పెళ్లికి వెళ్లింది. 12వ తేదీ తిరిగి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. కిటికీల్లోంచి చూడగా వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. భర్తకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఇంట్లో 30 తులాల బంగారం, 4 కేజీల వెండి, రూ.6లక్షల నగదు కనిపించలేదు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీసులకు పిర్యాదు చేసింది. తన భర్తను పిలిచి విచారించాలని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు బ్రహ్మం గారి మఠానికి చెందిన ఎలిపిల్లి పాపారావు, దుర్గా మల్లేశ్వరి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పాపారావు తాపీ పని చేస్తుండగా, మల్లేశ్వరి డెకరేషన్ పనులు చేస్తుంటుంది. బుధవారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి మల్లేశ్వరి బయటకు వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన పాపారావు, కుమారులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లేబర్ కోడ్ రద్దుకు డిమాండ్



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

నందిగామ రూరల్: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. ఆయా లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలంటూ గురువారం స్థానిక గాంధీ సెంటరులో భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును అమలు చేయాలని ఆరేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సొంతింటి నిర్మాణానికి రుణాలు అందించాలని, పిల్లల చదువులకు సంక్షేమ బోర్డు ద్వారా స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. ఇప్పటి వరకు మంజూరు చేసిన భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నాలుగు కోడ్‌ల రద్దు కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు షేక్ పితాన్‌మేస్త్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సయ్యద్ ఖాశీం, వెంకటేశ్వర్లు, స్వామి, మైనర్ బాబు, వలి పాల శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ..

చందర్లపాడు(నందిగామటౌన్): ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు చందర్లపాడులో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈసందర్భంగా సీఐటీయూ చందర్లపాడు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు మాట్లాడుతూ 1214 మెమోను రద్దు చేయడంతోపాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మౌలాలి, లాలు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కాశీం, నరేష్, నజీర్ పాల్గొన్నారు

వడదెబ్బ నివారణ మందుల పంపిణీ



హోమియో మందులు పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

నందిగామరూరల్: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సత్యదివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు రామిరెడ్డి కోటిసూర్యం సూచించారు. మండలంలోని మునగచర్ల గ్రామంలో హోమియో వైద్యుడు భానుప్రసాద్ సౌజన్యంతో అందజేసిన వడదెబ్బ నివారణ హోమియో మందులను సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో మందులు వినియోగంతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ముఖ్యంగా వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా హోమియో మందులు ప్రభావవంతంగా పని చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంగలూరి నరసింహయ్య, గ్రామ నాయకులు చిరుమామిళ్ల సుజాత, నాగేశ్వరరావు, వెంకట్రావ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు భద్రత కల్పించాలి



జగ్గయ్యపేటఅర్బన్: అనేక సవాళ్లతో కూడిన న్యాయవాద వృత్తిలో న్యాయవాదులు తమ భద్రతను కోల్పోతున్నారని జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేయాల్సిన లా మిత్ర స్టయిఫండ్ అందక జూనియర్ న్యాయవాదులు జీవనోపాధి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాదుల సంక్షేమం, వారి భద్రత కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు రాష్ట్రగవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు అందజేసిన వినతిపత్రంలోని అంశాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో శ్యామల నరసింహారెడ్డి, చావా రవి, రాయపూడి శ్రీనివాసరావు, వి.మధు, వై.రాజేంద్రప్రసాద్, శ్రీనివాసగౌడ్ ఎం.ఆంజనేయులు, రావూరి ప్రసాద్, ఎ.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట సీఐ కొండలరావు పిలుపునిచ్చారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు అపార్టుమెంట్లలో కొత్త చట్టాలు – అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండలరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 1930ను ఏఏ సందర్భాలో.. ఏవిధంగా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



మునేరు కాజ్‌వే సమీపంలో నిలిచిన వాహనాలు



కాజ్‌వే టర్నింగ్ వద్ద అడ్డదిడ్డంగా వాహనాలు

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు

- కాజ్‌వేపై బారులు తీరిన వాహనాలు
- మండుటెండలో వాహనదారులకు తప్పని పాట్లు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో గురువారం గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మునేరు అవతల ఫంక్షన్ హాల్స్, మామిడితోటల్లో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లతోపాటు వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్‌వే మరమ్మతులు కారణంగా వాహనాలను పెనుగంచిప్రోలు మీదుగా మళ్లించడంతో వందలాది వాహనాలు మునేరు కాజ్‌వేపై బారులు తీరాయి. మునేరు కాజ్‌వేపై మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో మండుటెండలో బైక్‌లపై ఉన్న మహిళలు, పిల్లలు, వృద్ధులు అల్లాడిపోయారు. సెలవు దినాలు కావడం, వాహనాల మళ్లింపుతో పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఇకనైనా పాలకులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనచోదకులు, మండల ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు-వేములనర్వ రోడ్డులో వాహనాల రద్దీ



పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితి